ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ సంపుటి : 18 సంచిక : 296 ఆదివారం, జూన్ 22, 2025 పేజీలు:4 వెల: 1 రూ/

Published from Hyderabad, Medak Nalgonda, Karimnagar, Warangal, Khammam

MHR TV



# ప్రపంచ శాంతికి యోగా దిక్సూచి

## - విశాఖ యోగా డేలో ప్రధాని మోదీ

**- విశాఖలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్న మోదీ**

**- అంతర్గత శాంతి ప్రపంచ విధానంగా మారాలని ఆకాంక్ష**

**- ఆర్కే బీచ్‌లో మూడు లక్షల మందితో కలిసి ప్రధాని యోగాసనాలు**

**విశాఖపట్నం** ప్రపంచం నేడు అనేక సంఘర్షణలు, అశాంతి, అస్థిరతతో సతమతమవుతున్న తరుణంలో యోగా శాంతి మార్గాన్ని నిర్దేశిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. విశాఖపట్నంలో శనివారం ఉదయం జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ జాతీయ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ యోగా దినోత్సవం 'మానవాళి కోసం యోగా 2.0' కు నాంది పలకాలని, దీని ద్వారా అంతర్గత శాంతి ప్రపంచ విధానంగా మారాలని అంతర్జాతీయ సమాజానికి ఆయన పిలుపునిచ్చారు. విశాఖలోని ఆర్కే బీచ్‌లో మూడు లక్షల మందికిపైగా ప్రజలతో కలిసి ప్రధాని మోదీ కామన్ యోగా ప్రొటోకాల్ (సీవైపీ)లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనందం, శాంతిని పెంపొందించడంలో యోగా ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. ఘర్షణల నుంచి సహకారానికి, ఉద్రిక్తతల నుంచి పరిష్కారానికి ప్రపంచాన్ని నడిపించడం ద్వారా యోగా శాంతిని చేకూర్చగలదని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. "దురదృష్టవశాత్తు, నేడు ప్రపంచం మొత్తం ఉద్రిక్తత, అశాంతితో సతమతమవుతోంది. అనేక ప్రాంతాల్లో అస్థిరత పెరుగుతోంది. ఇలాంటి సమయంలో యోగా మనకు శాంతి మార్గాన్ని చూపుతుంది. మానవాళి శ్వాస తీసుకోవడానికి, సమతుల్యం చేసుకోవడానికి, తిరిగి సంపూర్ణంగా మారడానికి అవసరమైన విరామ బటన్ యోగా" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యోగా కేవలం వ్యక్తిగత సాధన మాత్రమే కాకుండా, ప్రపంచ భాగస్వామ్యానికి మాధ్యమంగా మారాలని, ప్రతి దేశం, సమాజం యోగాను తమ జీవన విధానంలో, ప్రభుత్వ విధానంలో భాగంగా చేసుకోవాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, యోగా కేవలం వ్యాయామం కాదని, అదొక జీవన విధానమని అన్నారు. "యోగా అంటే సరళంగా చెప్పాలంటే కలపడం.

2లో..

## సీఎంవో అడ్డాగా చేసుకొని ఫోన్ ట్యాపింగ్

### - త్వరలోనే సిట్ విచారణకు హాజరవుతా

- కేసీఆర్, కేటీఆర్ లను కూడా విచారించాలి
- కేసును సీబీఐకి బదిలీ చేయాలని డిమాండ్
- ప్రభాకర్ రావుకు రాచమర్యాదలు చేస్తున్నారని మండిపాటు



**కరీంనగర్** గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్, బీజేపీ నేతల ఫోన్లతో పాటు సినీ నటులు, రియల్ ఎస్టేట్, జడ్జిల ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఆరోపణలున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫోన్ సైతం ట్యాపింగ్ అయిందని బయటకు వచ్చింది. ఈ క్రమంలో సిట్ ఫోన్ కాల్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. తనకు సిట్ నుంచి ఫోన్ కాల్ వచ్చిందని, త్వరలో విచారణకు హాజరవుతానని స్పష్టం చేశారు. ఫోన్

2లో..

## సీసీటీవీ ఫుటేజ్ బహిర్గతపరచాలని డిమాండ్

### - స్పందించిన ఎన్నికల సంఘం




**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని బహిర్గతం చేయాలంటూ ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్లపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) స్పందించింది. అటువంటి చర్య చట్టవిరుద్ధమని, ఓటర్ల గోప్యతకు భంగం కలిగించడమే అవుతుందని స్పష్టం చేసింది. గత ఏడాది మహారాష్ట్రలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, పోలింగ్ సమయంలో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు గుప్పించాయి. ఈ క్రమంలోనే, పోలింగ్‌కు సంబంధించిన 45 రోజుల సీసీటీవీ ఫుటేజీని బయటపెట్టాలని డిమాండ్

2లో..

## అందరి సహకారంతో రెండు గిన్నిస్ రికార్డు

- యోగాంధ్ర నిర్వహణపై చంద్రబాబు సంతృప్తి
- విశాఖలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా యోగాంధ్ర-2025
- కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ కావడంపై సీఎం చంద్రబాబు హర్షం
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఎంతో కీలక భూమిక పోషించారని కితాబు



**విశాఖపట్నం** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన యోగాంధ్రపై జగన్ చేసిన విమర్శలను చంద్రబాబు తిప్పికొట్టారు. యోగాంధ్ర కార్యక్రమం ఇంత భారీ త్తున ప్రజల డబ్బు వృథా చేస్తున్నారని జగన్ వ్యాఖ్యానించారు. కొన్ని సందర్భాల్లో కొందరి గురించి మాట్లాడటం కూడా అనవసరమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రుషికొండ ప్యాలెస్ నిర్మాణం కోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన వ్యక్తులు ఇప్పుడు ఇలాంటి విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసేలా, కలుషితం చేసేలా ఎవరు ప్రయత్నించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

2లో..



## పాకిస్థాన్ గొంతు ఎండాల్సిందే


### - సింధూ జలాల ఒప్పందంపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పునఃప్రారంభించే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ ఒప్పందంలోని నిబంధనలను పాకిస్థాన్ ఉల్లంఘించిందని, ఇన్నాళ్లూ అన్యాయంగా నీటిని పొందిందని, ఇకపై ఆ దేశం నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా మాట్లాడుతూ, "అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేము, కానీ సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు భారతదేశానికి ఉంది. మేం అదే చేశాం" అని అన్నారు. ఈ ఒప్పందం పీఠికలో రెండు దేశాలు శాంతి, పురోగతి సాధించాలనే అంశం ఉందని, అయితే ఒకసారి దాన్ని ఉల్లంఘించిన తర్వాత రక్షించడానికి

2లో..

## ఒక్క సీటుకు ఆరుగురు పోటీ

### - కాంగ్రెస్ పార్టీలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే టిక్కెట్ లొల్లి



**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం బైపోల్ సమరం అధికార కాంగ్రెస్ కు పంటినొప్పిగా మారింది. తియ్యాలన్నా కష్టమే, భరించాలన్నా కష్టమే అన్నట్లుగా ఉంది. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఉపఎన్నిక అనివార్యమైంది. అందుకే బరిలోకి దిగేందుకు ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచి వ్యూహాలు మొదలుపెట్టాయి. కాంగ్రెస్ పార్టీలో మాత్రం సీటు లొల్లి ఆదిలోనే పీక్స్ కు చేరుకుంది. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా అరడజను మంది కాంగ్రెస్ అభ్యర్థులు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే టిక్కెట్ కోసం లాబియింగ్ మొదలుపెట్టేశారు. తాజాగా ఆ పార్టీనేత

2లో..

## అన్ని అత్యవసర సేవలకు 112


- ఇకపై అన్నింటికీ ఒకటే ఎమర్జన్సీ నెంబర్
- తెలంగాణాలో అమల్లోకి వచ్చిన 112 అత్యవసర నంబర్
- 112 డయల్ చేయగానే జీపీఎస్ ట్రాక్ చేసి నేరుగా సేవలు

**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్రంలో ప్రజల భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా, అన్ని అత్యవసర సేవల కోసం ఒకే నంబర్‌గా 'డయల్ 112' అందుబాటులోకి వచ్చిందని రాష్ట్ర డీజీపీ జితేందర్ అధికారికంగా




2లో..

## నా దృష్టిలో ఉక్రెయిన్ మొత్తం మాదే




మాస్కో రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు చల్లారడం లేదు. తాజాగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్ భవిష్యత్తుపై కీలకమైన వ్యాఖ్యలు చేశారు. తన దృష్టిలో ఉక్రెయిన్ మొత్తం రష్యాకు చెందినదేనని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమయంలో కీవ్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తూ, పరిస్థితి మరింత దిగజారకముందే చర్చలకు

2లో..

### ఆయుష్మాన్ ఆరోగ్య మందిర సేవల్లో

# జగిత్యాల జిల్లా రాష్ట్రంలో అగ్రగామి



**జగిత్యాల, జూన్ 21:** ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, అందించే ఓపి, వెల్ నెస్ సేవలు, జాస్ కమిటీ సమావేశాలు ఇతర అన్ని రకాల సేవలలో రాష్ట్రం మొత్తంలో జగిత్యాల జిల్లా వరుసగా ఏప్రిల్ మరియు "మే" మాసాల్లో స్థిరమైన సేవలు అందిస్తూ అగ్రస్థానంలో నిలవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లాలో ప్రతినెల ప్రోగ్రాం అధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ ప్రాజెక్టు అధికారితో పాటు, జిల్లా కార్యాలయంలోని సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలను సందర్శిస్తూ, రికార్డులను తనిఖీ చేస్తూ ఆరోగ్య సేవలు మెరుగుపరచడానికి, సిబ్బందికి ఎప్పటికప్పుడు తగిన సూచనలు చేస్తూ తోడ్పాటునందించడం, సిబ్బంది అందరూ కూడా సహకరించడం వల్ల అభివృద్ధి సాధ్యమైనది అని, అలాగే కాలానుగుణ వ్యాదుల నివారణ, నియంత్రణలో జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ఆదేశాల మేరకు ప్రతిరోజూ సిబ్బంది, జ్వర సర్వే నిర్వహించడం, డ్రై-డే, పాటించేలా చేయడం, గతంలో జ్వరాలు అధికంగా నమోదైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టడం, గ్రామ మండల స్థాయిలో వివిధ ప్రభుత్వశాఖలు, స్వచ్ఛంద సేవా సంస్థలు , మహిళా సంఘ సభ్యులు, యువజన సంఘ సభ్యులను బాగస్వామ్యం చేస్తూ, ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు చేపట్టడం జరుగుచున్నది. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, మరియు ఇతర ఉన్నతాధికారులు విరివిగా క్షేత్ర ప్రర్యటనలు చేయడం ద్వారా వైద్య ఆరోగ్య సేవల్లో గననీయమైన అభివృద్ధి సాధ్యమైంది. ఇందులో భాగస్వామ్యులైన, అధికారులకు, వైద్యాధికారులకు, ప్రోగ్రామ్ అధికారులు, పర్యవేక్షకులు,సిబ్బందికి, అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ , సేవల్ని ఇలాగే కొనసాగించి జిల్లా ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్య సేవలందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప ఆరోగ్య అధికారి డా. ఎన్. శ్రీనివాస్ ప్రోగ్రాం అధికారులు డా. సమ సమీయుద్దీన్, డా. ఏ. శ్రీనివాస్, డా. అర్చన, డా. జైపాల్ రెడ్డి, జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా ప్రాజెక్టు అధికారి తులసి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**- జిల్లా ఎస్పి అశోక్ కుమార్**



**జగిత్యాల** పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసు ప్రదాన కార్యాలయం ఏర్పాటు చేసిన యోగ కార్యక్రమంలో జిల్లా ఎస్పి ,పోలీస్ అదికారులు, సిబ్బంది పాల్గొన్నారు.మంగళవారం ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... యోగ విద్య ఒక అద్భుతమైన ప్రక్రియగా అభివర్ధిస్తూ, మన భారతావని ప్రపంచానికి అందించిన ఆరోగ్య ఫలం యోగ అని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నిత్యం బిజీ బిజీ గా ఉండే అధికారులు, సిబ్బంది నిత్యం యోగా సాధనతో తమ ఆరోగ్యంపై పట్టుసాధించన్నారు. నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం వలన ఆరోగ్యంగా జీవించవచ్చని, ఇందులో ఎటువంటి సందేహం లేదని అన్నారు. యోగా వల్ల మనదేశానికి ప్రపంచంలో ఒక మంచి స్థానం వచ్చిందని, ఇది ప్రతీ భారతీయుడు గర్వపడే అంశం అని, యోగ వల్ల జరిగే లాభాలు గురించి వివరించారు. అధికారులు, సిబ్బంది నిత్యం విధినిర్వహణలో ఉండటం వలన తమ ఆరోగ్యం పట్టించుకోకపోవడంతో ఎన్నో రకాల అనారోగ్యాలకు గురవుతున్నారని ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు సమర్థవంతంగా సేవలందించగలమని అన్నారు. మిగతా ఎక్సర్సైజ్ లగా కాకుండా , ఎక్కడైనా, ఎలాంటి వ్యాయామ పరికరాలు అవసరం లేకుండా ఆరోగ్యాన్ని మానసిక సమతుల్యత లభించే ఏకైక మార్గం యోగ అని అన్నారు. యోగా ద్వారా మెరుగైన జీవనం, అద్భుతమైన శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యం, ఉత్తమ ఆలోచనలు కలుగుతాయన్నారు. అధికారులు,సిబ్బంది యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా మార్చుకోవడం ద్వారా ఆనందకర జీవితాన్ని పొందగలరని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ అరగంట పాటు యోగా చేస్తే చాలా వరకూ లైఫ్ స్టయిల్ అనారోగ్యం పాలుకాకుండా ఉండవచ్చనన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీమ్ రావు, డిఎస్పీలు రఘు చందర్,రాములు, ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీ ఖాన్ , శ్రీధర్, రామ్ నరసింహా రెడ్డి, అనిల్ కుమార్, సుధాకర్,కరుణాకర్,రవి,సురేష్,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, వేణు, సైదులు, ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రిటైర్డ్ హెడ్మాస్టర్ మృతికి ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డి నివాళులు



**బద్వేలు** బద్వేలు నియోజకవర్గంలోని బద్వేలు మండలానికి చెందిన నంది పల్లె గ్రామ వాస్తవ్యులు రిటైర్డ్ హెడ్మాస్టర్ పంగా సుబ్బారెడ్డి మరణించిన విషయం తెలుసుకొని వారి స్వగృహం కు వెళ్లి పార్థివదేహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి అధైర్యపడవద్దు ధైర్యం చెప్పారు ఎమ్మెల్సీ మాట్లాడుతూ సుబ్బారెడ్డి విద్యారంగంలో విశేష సేవలు అందించారని, సమాజానికి ఆదర్శంగా నిలిచిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పోకల మల్లేశ్వర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు వీరారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామస్వామి రెడ్డి, మండలం వైస్ ఎంపీపీ చిన్న సుబ్బారెడ్డి,జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణ రెడ్డి, గ్రామస్తులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# అన్ని అత్యవసర సేవలకు 112

ప్రకటించారు. ఇదివరకు పోలీస్ (100), అగ్నిమాపక (101), వైద్య సహాయం (108), మరియు పిల్లల భద్రత (1098) వంటి వేర్వేరు సేవలకు భిన్నమైన సంఖ్యలు ఉండేవి. ఇకపై ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా ప్రజలు కేవలం 112కు ఫోన్ చేస్తే సరిపోతుంది. ఈ వ్యవస్థ ప్రజలకు సహాయాన్ని చేరువ చేయడమే కాకుండా అత్యవసర సమయాల్లో వేగవంతమైన రెస్పాన్స్‌ను అందిస్తుంది. ఇది రాష్ట్ర భద్రతా వ్యవస్థలో ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తుంది. 'డయల్ 112' వ్యవస్థ, అమెరికాలో 911, యూరప్ దేశాల్లోని అత్యవసర సంఖ్యల స్ఫూర్తితో రూపొందించబడింది. ఇది కేవలం ఒక ఫోన్ నంబర్ మాత్రమే కాదు, అత్యవసర కాల్స్‌ను ఒకే కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సమన్వయం చేసే సమగ్ర సాంకేతిక వేదిక. ఈ వ్యవస్థలో జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) ట్రాకింగ్ సామర్థ్యం కీలక పాత్ర పోషిస్తుంది. ఎవరైనా 112కు ఫోన్ చేసిన వెంటనే, వారి ఖచ్చితమైన స్థానాన్ని గుర్తించి సమీపంలో అందుబాటులో ఉన్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలను తక్షణమే సంఘటన స్థలానికి పంపేలా ఈ వ్యవస్థను రూపొందించారు. ఇదివరకు ఉన్న డయల్ 100 ద్వారా పట్టణ ప్రాంతాల్లో సగటున 10 నిమిషాల్లో చేరుకుంటుండగా 112తో ఈ సమయాన్ని 8 నిమిషాలకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మార్పు ప్రజలకు గణనీయమైన ప్రయోజనాలను అందిస్తుంది. అత్యవసర సమయంలో వివిధ నంబర్‌లను గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉండదు. ఏ రకమైన ఆపద వచ్చినా.. ఒకే నంబర్‌కు కాల్ చేయడం ద్వారా పోలీసులు, అగ్నిమాపక దళం, వైద్య సిబ్బంది, ఇతర సంబంధిత అత్యవసర సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇది ప్రాణాలను, ఆస్తులను కాపాడటంలో కీలకమైన సమయాన్ని ఆదా చేస్తుంది. తెలంగాణ పోలీస్ శాఖ ఈ నూతన వ్యవస్థపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలను చేపడుతోంది. సోషల్ మీడియా మాధ్యమాలు, ఇతర ప్రసార సాధనాల ద్వారా ' డయల్ 112 ' ప్రాముఖ్యతను, వినియోగాన్ని వివరిస్తారు. ట్రాఫిక్ కూడళ్ల వద్ద, మరియు ప్రజా సమూహాలు ఉండే ప్రదేశాల్లో పోస్టర్లను, బ్యానర్లను ఏర్పాటు చేస్తారు. అంతేకాకుండా పోలీసు అధికారులు, కంట్రోల్ రూమ్ సిబ్బందికి ఈ వ్యవస్థపై ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు. తద్వారా వారు నూతన సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోగలరు.ప్రస్తుతానికి పాత నంబర్లకు (ఉదాహరణకు 100) కాల్స్ చేసిన '112'కు అనుసంధానం చేయబడతాయి. ఇది ప్రజలు కొత్త వ్యవస్థకు అలవాటు పడటానికి తగిన సమయాన్ని అందిస్తుంది. విపత్తు నిర్వహణ, నేర నియంత్రణలో ఇది ఒక బలమైన సాధనంగా నిలుస్తుంది. భవిష్యత్తులో ఈ వ్యవస్థను మరింత ఆధునీకరించి, అత్యాధునిక సాంకేతికతలను అనుసంధానించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## అందరి సహకారంతో రెండు గిన్నిస్ రికార్డు

ఇలాంటి భూతాన్ని ఎలా నియంత్రించాలో ప్రజలకు వివరించి వారిని చైతన్యపరుస్తామని తెలిపారు.యోగాంధ్ర కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం కూడా తన వంతు సహకారం అందించిందని కేంద్ర ప్రభుత్వం రూ.75 కోట్లు కేటాయించిందని చంద్రబాబు తెలిపారు. ప్రజల శ్రేయస్సు కోసమే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజల ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో మేలు చేస్తుందని, అలాంటి కార్యక్రమాలపై అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని సలహా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు విజయవంతంగా చేయడంపై సీఎం చంద్రబాబు అధికారుల్ని అభినందించారు. విశాఖలో అధికారులతో సమావేశమై కార్యక్రమం జరిగిన తీరుపై సమక్షించారు. ప్రజల సహకారం, వారి క్రియాశీల భాగస్వామ్యం, అన్ని ప్రభుత్వ విభాగాల సమన్వయంతోనే ఇది సాధ్యమైందని చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి ఒక మంచి కార్యక్రమంలో ఇది గొప్ప ముందడుగు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడంలోనూ, పలు ప్రపంచ రికార్డులు సాధించడంలోనూ కీలక పాత్ర పోషించిన మంత్రులు, శాసనసభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు.మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించి కార్యక్రమాలను విజయవంతం చేశారన్నారు. యోగా దినోత్సవం రోజున అర్ధరాత్రి 2 గంటల నుంచే ప్రజలు కార్యక్రమ స్థలాలకు తరలిరావడం తమను ఆశ్చర్యానికి గురిచేసిందని విశాఖపట్నంలో నిర్వహించిన ప్రధాన కార్యక్రమంలో 3 లక్షల మందికి పైగా ప్రజలు ఉత్సాహంగా యోగా సాధనలో పాల్గొనడంపై ప్రజల్లో వచ్చిన ఆరోగ్య స్పృహకు నిదర్శనంగా భావిస్తున్నారు. యోగాంధ్రలో కార్యక్రమంలో పాల్గొన్న వారి సంఖ్యను కచ్చితంగా లెక్కించేందుకు ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం అద్భుతమైన ఫలితాలను ఇచ్చిందని సాంకేతిక పరిజ్ఞానంతో హాజరు లెక్కింపు పక్కాగా జరిగిందని దాని వల్లే గిన్నిస్ రికార్డు సులువు అయిందని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. 11వ అంతర్జాతీయ యోగా డే నిర్వహణపై ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటిస్తామని చంద్రబాబు తెలిపారు. గేమ్ ఛేంజర్‌గా నిలిచిన ఈ వేడుకకు ఓ లాజికల్ ముగింపు ఇస్తామని చెప్పారు. యోగా కుటుంబానికి భారం కాదని రాష్ట్రానికి భారం కాదని పెద్ద ఎత్తున యోగాంధ్రను ప్రోత్సహిస్తామని చెప్పారు. డిజిటల్ హెల్త్ కార్డులకు సంబంధించి బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి నూతన ఒరవడిలు సృష్టిస్తున్నామన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుతూ వైద్య ఖర్చులు బాగా తగ్గేలా ఈ ప్రాజెక్టు రూపొందుతోందన్నారు.

### మహంకాళి ఆలయ పరిసరాల్లో

# ఎమ్మెల్యే తలసాని పర్యటన

**సికింద్రాబాద్..** ఉజ్జయిని మహంకాళి బోనాల పండుగ నేపథ్యంలో మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆలయ పరిసర ప్రాంతాలలో పర్యటించారు. మహంకాళి బోనాలు ఉత్సవాలను ఘనంగా జరపాలని ఆయన కోరారు. అన్ని శాఖల అధికారులతో కలిసి ఆయన ఆలయ ప్రాంగణంలో తిరుగుతూ ఇటీవల నెలకొన్న సమస్యలను పండుగ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు లక్షలాదిమంది ప్రజలు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుండి రానున్న నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈనెల 29న ఘటాల ఊరేగింపు, వచ్చేనెల 13 14వ తేదీలలో బోనాలు రంగం కార్యక్రమం జరగనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా బోనాల పండుగను ఘనంగా జరుపుకోవాలని అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ పరిసర ప్రాంతాలలో ఉన్న టాయిలెట్లు సిసి రోడ్లు క్యూ లైన్ లను ఆయన పర్యవేక్షించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు

### శ్రీశైలం హాస్పటల్ పరిధిలో

# స్వర్ణాంధ్ర , స్వచ్ఛంద్ర కార్యక్రమం

**శ్రీశైలం** శనివారం రోజు శ్రీశైలం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర,స్వచ్ఛంద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమంలో భాగంగా మండల హాస్పటల్ పరిధిలో గల పరిసరాలు మరియు గదులను శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీశైలం నాలుగవ సచివాలయం పరిధిలో పనిచేయుచున్న ఆశా కార్యకర్తలు,మెడికల్ ఆఫీసర్, పి హెచ్ ఎన్, సూపెర్వైజర్, హెల్త్ అసిస్టెంట్, ఎమ్ ఎల్ హెచ్ పి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

### తెలంగాణ జాతిపిత

# ప్రొఫెసర్ జయశంకర్ సార్

**- కాంస్య విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలి.**

**- విశ్వకర్మ జేఏసీ**

తెలంగాణ జాతిపిత సిద్ధాంతకర్త స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ సార్ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ జేఏసీ చైర్మన్ రాయబండి పాండురంగ చారి ప్రభుత్వాన్ని డిమాండ్ .శనివారం రోజున హైదరాబాద్ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ జాతిపిత జయశంకర్ సార్ 14వ వర్ధంతి సందర్భంగా విశ్వకర్మ జేఏసీ పక్షాన ఘనంగా నివాళులర్పించడం జరిగిందిఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాండురంగ చారి హాజరై ప్రసంగిస్తూ జయశంకర్ సార్ అంటే జాతిపిత,జాతిపిత అంటే తెలంగాణ అని తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్యపాత్ర వహించారని,తెలంగాణ ఎన్నో దశాబ్దాలుగా వివక్షతకు, అసమానతలకు,గురై అన్యాయాన్ని ప్రాణాలు సైతం లెక్కచేయకుండా నాలుగు కోట్ల జనం భవిష్యత్తు కోసం, వారి బతుకు రాతను మార్చడం కోసం,ఆత్మగౌరవం కోసం, తన జీతాన్ని,జీవితాన్ని ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం, నీళ్లు, నిధులు, నియామకాలే యజెండగా ముందుకు నడిపించిన చరిత్ర జాతిపిత జయశంకర్ సార్ అని అన్నారు

తెలంగాణ రాష్ట్రంలో విశ్వకర్మ పంచదాయల వృత్తులు ప్రపంచీకరణ విధానాల వల్ల వృత్తులు నిర్వీరమై, అర్థాలతో అలమటిస్తూ, ఆత్మహత్యలకు దారితీస్తున్నాయని, వీరికి ప్రత్యేకమైన బడ్జెట్ ఏర్పాటు చేసి జనాభా ధామాషా ప్రకారం నిధులు కేటాయించి, ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మొదటి పేజీ తరువాయి

# ప్రపంచ శాంతికి యోగా దిక్సూచి

ఇది ప్రపంచాన్ని కలిపింది" అని ఆయన తెలిపారు. విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు విజయవంతంగా ముగియడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ చూపిన చొరవ, కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. యోగా దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను గత నెల రోజులుగా మంత్రి లోకేశ్ వ్యక్తిగతంగా పర్యవేక్షించారని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఆయన నిరంతర పర్యవేక్షణ వల్లే కార్యక్రమాలు ఇంతటి ఘన విజయం సాధించాయని ప్రశంసించారు. యోగాను కేవలం వ్యాయామంగా మాత్రమే కాకుండా, ఒక సామాజిక వేడుకగా ఎలా నిర్వహించవచ్చో లోకేశ్ చేసి చూపించారని కొనియాడారు. అంతేకాకుండా, 'యోగాంధ్ర' పేరిట చేపట్టిన కార్యక్రమాల ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో లోకేశ్ సఫలీకృతులయ్యారని ప్రధాని మోదీ ప్రశంసించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు సామాజిక ఐక్యతను కూడా సాధించవచ్చని ఈ కార్యక్రమాల ద్వారా నిరూపితమైందని ఆయన అభిప్రాయపడ్డారు. విశాఖలో జరిగిన యోగా దినోత్సవ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# సీఎంవో అడ్డాగా చేసుకొని ఫోన్ ట్యాపింగ్

ట్యాపింగ్ పై అందరి కంటే ముందు అరోపణలు చేసింది తానే అన్నారు. హైదరాబాదు, సిరిసిల్ల కేంద్రం గా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపించారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు చాలా మంది సంసారాలు నాశనం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభాకర్ రావు, రాధాకిషన్ రావు పలువురి ఉసురు పోసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు సిబిఐకి అప్పజెప్పాలి. జడ్జీల ఫోన్లు సైతం ట్యాపింగ్ అయ్యాయి. పెద్దాయన చెబితే ఫోన్ ట్యాపింగ్ చేశామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌కు కారణమైన కేసీఆర్, కేటీఆర్‌లకు ఇంకా ఎందుకు నోటీసులు ఇవ్వలేదు. ప్రభాకర్ రావు సీఎంవో ఆఫీసుని అడ్డగా చేసుకుని ఫోన్ ట్యాపింగ్ చేసారు. సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ చేశారు. ప్రభాకర్ రావుకు రాచమర్యాదలు చేయడం బంద్ చేయండి.అందరి జీవితాలు నాశనం చేసిందే అతడు. ప్రభాకర్ రావు అదేశాల మేరకే నన్ను పేపర్ లీక్ అయ్యిందని గతంలో నన్ను అరెస్టు చేశారు. అనుమానం పుట్టాకే కేసీఆర్ పుట్టారు. కేసీఆర్ హయాంలో మామూలు ఫోన్ మాట్లాడాలంటేనే భయం. ఫేస్ టైం, సిగ్నల్ యాప్ లలోనే ఫోన్ మాట్లాడుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభాకర్ రావు అండ్ కో ని కాపాడే ప్రయత్నాలు చేస్తోంది. తెలంగాణని సర్వనాశనం చేసిందే కేసీఆర్ ఫ్యామిలీ అని, ప్రభాకర్ రావు ఇండియాకి వచ్చే ముందు కేటీఆర్ అమెరికా ఎందుకు వెళ్లారు. కేటీఆర్ అమెరికాకి పోయి ప్రభాకర్ రావుతో మాట్లాడిన తరయవాతనే ఆయన ఇండియాకి తిరిగొచ్చాడు' అని బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

# సీసీటీవీ ఫుటేజ్ బహిర్గతపరచాలని డిమాండ్

చేశాయి."2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికలతో పాటు, మహారాష్ట్ర సహా అన్ని రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు చెందిన ఓటరు జాబితాలను విడుదల చేయాలి. అలాగే, మహారాష్ట్ర ఎన్నికల సీసీటీవీ ఫుటేజీని కూడా ఈసీ బహిర్గతం చేయాలి" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల నేపథ్యంలో ఎన్నికల సంఘం తన వైఖరిని స్పష్టం చేసింది. "సీసీటీవీ ఫుటేజీ ద్వారా ఒక సమూహాన్ని లేదా ఓటర్‌ను తేలికగా గుర్తించే అవకాశం ఉంటుంది. దీనిని బహిర్గతం చేస్తే, ఓటు వేసినవారు, వేయనివారు కూడా సామాజిక వ్యతిరేక శక్తుల నుంచి ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది. ఓటర్లను బెదిరించేందుకూ ఆస్కారం ఉంటుంది. కాబట్టి, ఈ ఫుటేజీని బయటపెట్టడం నిబంధనలకు విరుద్ధం. అలా చేయడం వల్ల చట్టపరమైన సమస్యలు కూడా తలెత్తవచ్చు. ఈ వీడియోలు కేవలం అంతర్గత పర్యవేక్షణ కోసం మాత్రమే ఉద్దేశించినవి. ఎన్నికల వివాదాలకు సంబంధించి ఏదైనా న్యాయస్థానం కోరితే, అప్పుడు మాత్రమే ఆ వివరాలను కోర్టుకు అందజేస్తాం" అని ఎన్నికల సంఘం వివరించింది.ఇదిలా ఉండగా, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీ డేటాను 45 రోజుల తర్వాత తొలగించవచ్చని ఈసీ ఇటీవల తెలిపింది. ఎన్నికలపై 45 రోజుల్లోగా ఎలాంటి ఫిర్యాదులు గానీ, కోర్టు కేసులు గానీ నమోదు కాకపోతే, ఆ ఫుటేజీలను తొలగించాలని ఆదేశించింది. ఎన్నికల సరళి వీడియోలు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆయా రాష్ట్రాల ఎన్నికల అధికారులకు సూచనలు జారీ చేసింది.

# ఒక్క సీటుకు ఆరుగురు పోటీ

అజారుద్దీన్ మరో అడుగు ముందుకేసి, బరాబర్ ఈసారి కూడా జూబ్లీహిల్స్ టిక్కెట్ నాదేనంటూ మీడియా ముఖంగా ప్రకటించేశారు. అజారుద్దీన్ గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్‌పై పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి అలా కాదు గట్టిగా ప్రచారం చేస్తా, నేనే గెలుస్తానంటూ సీటు ప్రకటించకముందే స్వీట్లు పంచేస్తున్నారు. అజారుద్దీన్ వ్యాఖ్యలపై టిపిసిసి ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందిస్తూ అదేం కుదరదు. ఇంకా ఎమ్మెల్యే టిక్కెట్ ఎవరికివ్వాలో అధిష్టానం నిర్ణయం తీసుకోలేదంటూ అజారుద్దీన్ వ్యాఖ్యలను ఖండించారు. జూబ్లీహిల్స్ టిక్కెట్‌పై ఫిరోజ్ ఖాన్ కూడా మోజుపడ్డారు. నాకు సీటు ఇవ్వాలి. గెలిచి కాంగ్రెస్ సత్తా చూపిస్తానంటూ బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. నాంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి, ఓటమిపాలైన ఫిరోజ్ ఖాన్ జూబ్లీహిల్స్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రేవంత్ కు సన్నిహితంగా ఉండే తనకే టిక్కెట్ కన్ఫామ్ అంటున్నారు. ఇదిలా ఉంటే పీజెఆర్ కూతురు విజయారెడ్డి సైతం జూబ్లీహిల్స్ సీటు కోసం వాయువేగంతో దూసుకుపోతున్నారు. ఖైరతాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమిపాలైన విజయారెడ్డి, తన ప్రత్యర్థి దానం కాంగ్రెస్‌లోకి రావడంతో, ఆమెకు ఇప్పుడున్న ఏకైక ఆప్షన్ జూబ్లీహిల్స్. అందుకే గట్టి లాబింగ్ మొదలుపెట్టేశారు. తన తండ్రి చరిష్మాతో జూబ్లీహిల్స్ ఇలాకాలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు.సామాజికవర్గం ప్రభావం ఎక్కువగా ఉండే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే సీటు తనకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నేత నవీన్ యాదవ్ డిమాండ్ చేస్తున్నారు. ఇటు కాంగ్రెస్ అటు ఎంఐఎంతో సత్సంబంధాలు ఉండటంతో సీటిస్తే గెలుపు పక్కా అంటూ అధిష్టానికి హామీ ఇస్తున్నారు. ఇదిలా ఉంటే తాజాగా మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేరు తెరపైకి వచ్చింది. తాను మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం, తన భార్య శ్రీదేవి యాదవ సామాజిక వర్గం కావడంతోపాటు గతంలో మేయర్‌గా చేసిన అనుభవం, గ్రేటర్ పరిధిలోని పరిచయాలతో తన గెలుపు నల్లేరుమీద నడకేనని, సీటు ఇచ్చి చూడండి అంటూ కాంగ్రెస్ అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. వీరికి తోడు సీఎం రేవంత్ రెడ్డి అత్యంత సన్నిహితుడైన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత వహీం కురేషీ కూడా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే టిక్కెట్ రేసులో ఉన్నట్లు సమాచారం. ఇలా ఏకంగా అరడజను మంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఆ టిక్కెట్ మాదంటే మాదంటూ బహిరంగ వార్ కు దిగుతున్నారు.టిక్కెట్ పోటీ ఇలా ఉంటే, ఎమ్ ఐఎమ్ ఇచ్చిన ట్విస్ట్‌తో మైనార్టీ అభ్యర్థుల ఆశలు అడియాసలైయ్యేలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ బైపోల్ లో కాంగ్రెస్ పార్టీ నుంచి మైనార్టీ అభ్యర్థికి టిక్కెట్ ఇస్తే , తామూ పోటీలోకి దిగుతామంటూ ఎమ్ ఐఎం అంటోంది. ఎంఐఎం తప్ప మరో పార్టీలో మైనార్టీ నేత తెరపైకి రావోద్దనే ఆలోచనతోన్టే కాంగ్రెస్ లో మైనార్టీ అభర్థులకు చెక్ పెడుతోందనే వాదనలు వినిపిస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 375000 ఓట్లున్నాయి. ఇందులో మైనార్టీ ఓటర్లు 125000పైగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎంఐఎంకు ఎదురెళ్లి ఇబ్బందుకు పడటం కంటే మైనార్టీయేతర అభ్యర్థికే సీటు కేటాయించాలనే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు సమాచారం.

# నా దృష్టిలో ఉక్రెయిన్ మొత్తం మాదే

రావాలని పిలుపునిచ్చారు. మాస్కోలో జరిగిన ఓ కార్యక్రమంలో పుతిన్ మాట్లాడుతూ, "రష్యన్లు, ఉక్రెయిన్లు చారిత్రకంగా ఒక్కటే. ఈ లెక్కన చూస్తే ఉక్రెయిన్ మొత్తం మాదే అవుతుంది. అయినప్పటికీ, కీవ్ సార్వభౌమత్వాన్ని గుర్తించడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని తెలిపారు. అయితే, క్షేత్రస్థాయి వాస్తవాలను ఉక్రెయిన్ అంగీకరించాలని, మాస్కో భౌగోళిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని ఆయన నొక్కిచెప్పారు.ప్రస్తుత సైనిక పరిణామాలపై పుతిన్ స్పందిస్తూ, "సరిహద్దు వెంబడి నిరంతర షెల్లింగ్‌తో ఉక్రెయిన్ మాకు ముప్పు కలిగిస్తోంది. అందుకే, ఒక భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. మా బలగాలు సుమీ ప్రాంతంలోకి సుమారు 10 కిలోమీటర్ల వరకు వెళ్లాయి. ప్రస్తుతం ఆ ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడం మా లక్ష్యం కాదు. కానీ, పరిస్థితి తీవ్రంగా మారితే, దానిని మా అధీనంలోకి తీసుకునే అవకాశాన్ని కొట్టిపారేయలేం" అని హెచ్చరించారు. ఉక్రెయిన్ నాటోలో చేరాలనే ఆశను వదులుకోవాలని పుతిన్ గట్టిగా సూచించారు. "ఈ సైనిక చర్య మీ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తుంది. అది మరింత తీవ్రరూపం దాల్చకముందే మాతో చర్చలకు వచ్చి, ఒక ఒప్పందం చేసుకోవాలి. రష్యా సైనికుడు ఎక్కడ అడుగుపెడితే, ఆ ప్రాంతం మాదే అవుతుందన్న నిజాన్ని గుర్తుంచుకోవాలి" అంటూ పుతిన్ ఉక్రెయిన్‌ను హెచ్చరించారు. ఉక్రెయిన్ లొంగిపోవాలని తాము కోరుకోవడం లేదని, కానీ వాస్తవాలను అంగీకరించి ముందుకు సాగాలని ఆయన వ్యాఖ్యానించారు.

# పాకిస్థాన్ గొంతు ఎండాల్సిందే

ఏమీ మిగలదని ఆయన స్పష్టం చేశారు. భారతదేశానికి హక్కుగా దక్కిన నీటిని సంపూర్ణంగా వినియోగించుకుంటామని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కెనాల్ నిర్మించి పాకిస్థాన్‌కు వెళ్లే జలాలను రాజస్థాన్‌కు మళ్లిస్తామని ఆయన వివరించారు. "ఇంతకాలం పాకిస్థాన్ అన్యాయంగా నీటిని పొందింది. ఇకపై ఆ దేశం గొంతు ఎండిపోవాల్సిందే" అంటూ అమిత్ షా వ్యాఖ్యానించారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ ఆదివారం 22, జూన్ 2025

# మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట



## కాళ్లకల్ పాఠశాలలోలో ఘనంగా

# యోగా దినోత్సవం

**మనోహరాబాద్ (ప్రజా స్వరం) :** అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం కాళ్లకల్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఘనంగా జరిగింది. ప్రధానోపాధ్యాయులు, యోగా ఉపాధ్యాయురాలు లు మాలతి నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రపంచ యోగా దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ , మెదక్ ఎంపీ రఘునందన్ రావు, సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షులు భైరి శంకర్ , మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ల పిలుపు తో ఈ కార్యక్రమం నిర్వహించామని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగ చేసే అలవాటును అలవర్చుకోవాలని ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడి సైతం యోగతో తగ్గించుకోవచ్చు అని అన్నారు. ప్రతి కుటుంబంలో ని ప్రతి ఒక్కరు యోగ చేసే అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.



ఇతరులకు సైతం యోగ పై అవగాహన కల్పిస్తూ యోగాతో జరిగే లాభాలను ప్రతి ఒక్కరికి వివరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యులు నరేందర్ చారి, నాయకులు పురం మహేష్ ముదిరాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింగం, పీఈటి మాలతి, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేష్, ముదిరాజ్, గ్రామ బిజెపి కమిటీ అధ్యక్షులు కొత్తూరు మల్లేష్ ముదిరాజ్, బీజేపీ బూత్ అధ్యక్షులు ఇరక్క గోపాల్ ముదిరాజ్ , ఎర్రోల్ల కృష్ణ , కుమ్మరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పంట బీమాకు సైంధవ పాత్రలో

# అప్పుడు కేసీఆర్, ఇప్పుడు రేవంత్

- 81 శాతం రైతు మద్దతు ధర పెంచిన ఘనత నరేంద్ర మోదీ దే
- కాంగ్రెస్ మళ్లీ రైతుల మభ్య పెట్టేందుకే రైతు నేస్తం పథకం - బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి.



**మెదక్ జూన్ 21 (ప్రజా స్వరం)** నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు సైంధవ పాత్ర పోషిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఆనాడు కెసిఆర్ ప్రభుత్వం పంట బీమా పథకాన్ని తెలంగాణ లో అమలు చేయడం లేదని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కిసాన్ సంవిధాన్ అమ్మ పేరిట ఒక మొక్కను నాటే కార్యక్రమం మెదక్ జిల్లా బీజేపీ కార్యాలయంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చేసిన అభివృద్ధి పనులను ప్రజల ముందు పెట్టి ఆశీర్వదించమని కోరే సాంప్రదాయానికి శ్రీకరం చుట్టింది నరేంద్ర మోడీ అన్నారు. 11 ఏళ్ల మోడీ పాలనలో చేసిన సేవ, అభివృద్ధిని ప్రజలకు వివరించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో అనేక జిల్లాల్లో రైతు పండించుకున్న పంట కండ్ల ముందే అతివృష్టి గుర్రై ఆగమైపోయారన్నారు. అదే పంటల బీమా యోజన పథకం అమలులో ఉంటే రైతులను ఆదుకునే అవకాశం ఉండేది అన్నారు. ఈ పాపం కాంగ్రెస్, రేవంత్ రెడ్డి సర్కారుదని రైతుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ఆరు గ్యారెంటీలు 420 హామీలతో శాసనసభ ఎన్నికల సమయంలో రైతుల మెప్పుకోసం అనేక హామీలు చేశారన్నారు. అంతకుముందు కేసీఆర్ రైతు వ్యతిరేక విధానాలను అవలంబించి రైతుల గొంతు కోసి వారిని మోసం చేస్తున్నాడని, ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలను నమ్మి తెలంగాణ వ్యాప్తంగా మొన్న అధికారంలోకి తీసుకువచ్చింది రైతులన్నారు. ఇదే రైతులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టబోతున్నారన్నారు. పార్టీ నాయకులు ప్రజా నాయకులుగా ఎదగాల్సిన సందర్భం ఇదని, కిసాన్ మోర్చా లో వివిధ బాధ్యతలు వహిస్తున్న మనం నరేంద్ర మోడీ ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న అప్పటి నుండి వరి మద్దతు ధర 81 శాతానికి పెంచడం జరిగిందన్నారు. ఈ దేశాన్ని అతి ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ నేడు రైతులపై మొసలి కన్నీరు కార్చింది తప్ప ఏ రోజు రైతుల బాగోగులను పట్టించుకోలేదన్నారు. నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు సైంధవ పాత్ర పోషిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఆనాడు కెసిఆర్ ప్రభుత్వం పంట బీమా పథకాన్ని తెలంగాణ లో అమలు చేయలేదన్నారు. రైతుల ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మళ్లీ రైతులను మభ్య పెట్టేందుకే రైతు నేస్తం కార్యక్రమం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. రాష్ట్రంలో 2 లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అయిందని చెబుతున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెబుతున్నారని అది పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. దీనిపై చర్చకు ఎక్కడికి రావాలో చెప్పాలని సవాల్ విసిరారు.




ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాగి రాములు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్, ఓబీసీ మోర్చ నాయకుడు శివ, జిల్లా నాయకులు రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుకునూరు పల్లిలో ఘనంగా యోగా దినోత్సవం



**కుకునూరు పల్లి / గజ్వేల్. ( ప్రజా స్వరం) :** 11 వ అంతర్జాతీయ యోగ దినోత్సవ రోజు సందర్భంగా కుక్కునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో జెడ్ పి హెచ్ స్కూల్‌లో యోగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నాం ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీకి కుక్కునూరు పల్లి మండల అధ్యక్షులుఅనుముల సంపత్ రెడ్డి మాట్లాడుతూ ముందుగా యోగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ,యోగ ప్రపంచానికి భారతదేశం



అందించిన అమూల్యమైన ఆరోగ్య బహుమతిని , రోజు యోగ ఆసనాలు చేయడం వల్ల ఒత్తిడి తగ్గించుకోవచ్చని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డమైన నాగరాజు, గట్టు అనిల్, తాళ్ళపల్లి బిక్షపతి,వంకని శివయ్య, లస్కరి శ్రావణ్, ఎర్ర యాదగిరి, ఎలా ఆంజనేయులు,ఈ కార్యక్రమానికి సహకరించిన హెడ్ మాస్టర్ గారికి ఉపాధ్యాయ బృందానికి ధన్యవాదాలుతెలిపారు.



# యోగాతో మాత్రమే సంపూర్ణ ఆరోగ్యం

- ప్రతి విద్యార్థి యోగా అలవాటుగా అలవర్చుకోవాలి.
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.
- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం.






**మెదక్ జూన్ 21 (ప్రజా స్వరం)** క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంత జీవన శైలిని పొందవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవం పురస్కరించుకుని శనివారం మెదక్ జిల్లా కేంద్రంలో గల ఇందిరా గాంధీ స్టేడియంలో అదనపు కలెక్టర్ నగేష్ పతంజలి, వశిష్ట యోగా సంస్థ ప్రతినిధులు, క్రీడాకారులు ఇతర ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల విద్యార్థినిలు వ్యాయామ ఉపాధ్యాయులు, లతో కలెక్టర్ కార్యక్రమంలో పాల్గొని యోగా అభ్యాస కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో కలెక్టర్ ప్రారంభిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయో, లింగ భేదం లేకుండా అందరూ యోగాను



సాధన చేయాలన్నారు. యోగా గురువు రవి అధికారులతో ఆసనాలు చేయించారు. పురాతన కాలం నుం చి యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, మా నవ శక్తులన్నింటినీ ఏకం చేసి ఏకాగ్రత సాధించడం యోగాకే సాధ్యమన్నారు. అనంతరం కలెక్టర్ యోగాసనాలు వేసి అందర్నీ ఉత్తేజపరిచారు. అనంతరం వశిష్ట యోగ సంస్థ ద్వారా ఆరోగ్యకరదీపిక, యోగా సాధన పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డాక్టర్ శ్రీరామ్, యువజన క్రీడల నిర్వహణ అధికారి వై దామోదర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, మైనార్టీ సంక్షేమ అధికారి జమ్లా నాయక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, సంబంధిత ఇతర శాఖల అధికారులు క్రీడాకారులు క్రీడాభిమానులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నాషా ముక్త్ భారత్ అభియాన్ కింద జిల్లా స్థాయిలో వారం రోజుల కార్యకలాపాలు.

నాషా ముక్త్ భారత్ అభియాన్ కింద జిల్లా స్థాయిలో వారం రోజుల మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యకలాపాలు కోసం ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను రూపొందించిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టగ్ ఆఫ్ వార్,లెమన్ అండ్ స్పూన్ క్రీడా పోటీలు మహిళలకు నిర్వహించారు, అనంతరం విద్యార్థినిలకు. బస్తా జంప్ గేమ్ వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ యాంటీ-నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, ప్రహరీ క్లబ్‌లు, సంబంధిత జిల్లాల్లోని వారం రోజులు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే మన జిల్లాలో ఈరోజు క్రీడా పోటీలు నిర్వహించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,జిల్లా సంక్షేమ అధికారి హైమావతి వివిధ జిల్లా అధికారులు సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్
హైదరాబాద్ ఆదివారం 22, జూన్ 2025

# యోగ విద్య ఒక అద్భుతమైన ప్రక్రియ

- నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలి..
- ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ అరగంట యోగా చేయాలి..
- అదనపు ఎస్పీ మహేందర్...
- ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం..







**మెదక్ జూన్ 21 (ప్రజా స్వరం)** ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే విధులు సక్రమంగా నిర్వహించగలం మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్ మహేందర్ తెలిపారు. శనివారం ఆర్ట్ అఫ్ లివింగ్ ఫౌండేషన్ సభ్యులు ప్రతిమ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమం మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ యోగ విద్య ఒక అద్భుతమైన ప్రక్రియగా అభివర్ణిస్తూ, మన భారతావని ప్రపంచానికి అందించిన ఆరోగ్య ఫలం యోగ అని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నిత్యం బిజీ బిజీ గా ఉండే అధికారులు, సిబ్బంది నిత్యం యోగా సాధనతో తమ ఆరోగ్యంపై పట్టుసాధించన్నారు. నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం వలన ఆరోగ్యంగా జీవించవచ్చని, ఇందులో ఎటువంటి సందేహం లేదని అన్నారు. యోగా వల్ల మనదేశానికి ప్రపంచంలో ఒక మంచి స్థానం వచ్చిందని, ఇది ప్రతీ భారతీయుడు గర్వపడే అంశం అని, యోగ వల్ల జరిగే లాభాలు గురించి వివరించారు. అధికారులు, సిబ్బంది నిత్యం విధినిర్వహణలో ఉండటం వలన తమ ఆరోగ్యం పట్టించుకోకపోవడంతో ఎన్నో రకాల అనారోగ్యాలకు గురవుతున్నారని ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు సమర్థవంతంగా సేవలందించగలమని అన్నారు. మిగతా ఎక్సర్సైజ్ లగా కాకుండా, ఎక్కడైనా, ఎలాంటి వ్యాయామ పరికరాలు అవసరం లేకుండా ఆరోగ్యాన్ని మానసిక సమతుల్యత లభించే ఏకైక మార్గం యోగ అని అన్నారు. యోగా ద్వారా మెరుగైన జీవనం, అద్భుతమైన శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యం, ఉత్తమ ఆలోచనలు కలుగుతాయన్నారు. అధికారులు,సిబ్బంది యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా మార్చుకోవడం ద్వారా ఆనందకర జీవితాన్ని పొందగలరని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ అరగంట పాటు యోగా చేస్తే చాలా వరకూ లైఫ్ స్టయిల్ అనారోగ్యం పాలుకాకుండా ఉండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, ఎఆర్ డీఎస్పీ రంగా నాయక్, ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ మధు సుధన్ గౌడ్, ఆర్ఐ లు రామ కృష్ణ, శైలందర్, ఎసై లు సిబ్బంది పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసిన నగర పంచాయతీ కమిషనర్

**బేతంచర్ల :** బేతంచర్ల పట్టణంలోని బనగానపల్లె రహదారిలో ఉన్న కస్తూరిబా బాలికల పాఠశాలను బేతంచర్ల నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ శనివారం నాడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని మధ్యాహ్నం భోజనం వంట తీరును పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా విద్యార్థులను భోజనం యొక్క నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెనూ ప్రకారం వంట చేసి విద్యార్థులకు న్యాయమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ మధు కుమార్, ప్రత్యేక అధికారి మెహరుణ్ణిసా బేగం, ఏఎన్ఎం ఉన్నారు.

# ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

## రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్** కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ శాఖలలో పనిచేసి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథి పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందలాది మంది ఔట్సోర్సింగ్/ఉద్యోగులు నేడు ఇందిరా పార్క్ వద్ద భారీ ధర్నా జరిపారు. ఈ ధర్నాకు బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి. రాజేందర్ అధ్యక్షతను వహించారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న లక్షలాది మంది ఉద్యోగులు 20-25 సంవత్సరాల నుండి పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత లేదు. సరిపోను జీతాలు లేవు. పర్మినెంట్ కావడం లేదు. పైగా నెల నెల సక్రమంగా జీతాలు చెల్లించడం లేదు.కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఐకార్ పరిశోదన సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను పదివేల నుండి 25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వీరు 20-25 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని వీరిని దశల వారీగా రెగ్యులరైజ్ చేయాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో 2 లక్షల 50వేల ఔట్సోర్సింగ్ ఉద్యోగాలను బీసీ, ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ శాఖ వైద్య, విద్య, ఆరోగ్య, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖలలో లక్షలాది ఉద్యోగులు ఏళ్ల తరబడి పని చేస్తున్నారు. వీరికి జీతాలు సక్రమంగా చెల్లించదంలేదు. 8 నెలలుగా వీరికి జీతాలు చెల్లించలేదు. పైగా అతి తక్కువ జీతాలు ఇస్తున్నారు. వీరికి వెంటనే జీతాలు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.సుప్రీంకోర్టులో సమాన పనికి సమాన వేతనం చెల్లిందాలని అనేక తీర్పులు వచ్చాయి కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ తీర్పును అమలు చేయడం లేదని విమర్శించారు. అలాగే 240 రోజులు రెగ్యులర్ గా పనిచేసిన వారిని పర్మనెంట్ చేయాలని సుప్రీంకోర్టు రాజస్థాన్ మధ్యప్రదేశ్ రాష్ట్రాలు వేసిన కేసులలో తీర్పులు చెప్పింది. కానీ మన తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడం లేదు. పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ పంజాబ్ రాష్ట్రాలు కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేశారని గుర్తు చేసారు.ఈ ధర్నాలో సి.రాజేందర్ రాష్ట్ర బి.సి సంఘం అద్యకులు,బి.సి. ఐక్య వేదిక అద్యక్షులు అనంతయ్య, విద్యార్థి సంఘం కన్వీనర్ మోది రాందేవ్, బాలస్వామి, బుపిష్ సాగర్, రాజు నేత ప్రసంగించారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం





**మెదక్ జూన్ 21 (ప్రజా స్వరం)** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం నర్సాపూర్ పట్టణ అధ్యక్షుడు నీరుడి చంద్రయ్య ఆధ్వర్యంలో దశాబ్ది వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ ప్రతి రోజు చేయడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగా ను తమ దినచర్య లో భాగంగా ఉంచుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళి యాదవ్, ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ రమణారావు, కౌన్సిలర్ సురేష్, రాజేందర్, బుచ్చేష్ యాదవ్, జిల్లా ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షులు గుండం శంకర్, మండల అధ్యక్షుడు నీలి నాగేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాదె బాలరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శిలు రామ్ రెడ్డి, సంఘసాని రాజు, బిజెపి నాయకులు నగేష్ గౌడ్, మహేందర్ గౌడ్, బూత్ అధ్యక్షులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రతి రోజు యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

## - జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



**జగిత్యాల :** ప్రతి రోజు యోగా సాధన తోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ను పురస్కరించుకొని అయ్యుష్, జిల్లా స్పోర్ట్స్ ఆథారిటి ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా తీసుకొంటున్న ఆహారం తో చిన్న వయస్సులోనే రోగాల భారిన పడుతున్నారన్నారు. పాతకాలంలో యాభై ఏండ్లు దాటినా ఎటువంటి వ్యాధులు లేకుండా సంపూర్ణ ఆరోగ్యం తో జీవించారన్నారు. నేటి పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ముప్పై ఇదేండ్లకే షుగర్, బిపి ల భారిన పడుతున్నారన్నారు. సంపూర్ణ ఆరోగ్యం తో జీవించాలంటే మన జీవితంలో ప్రతి రోజు యోగా ను చేర్చాలన్నారు. అప్పుడే సంపూర్ణ ఆరోగ్యం తోపాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం లో ఆర్డివో మధుసూదన్ తోపాటు జిల్లా స్థాయి అధికారులు, ఇతర ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ కినివాళులు అర్పించిన మాజీ మంత్రి



**వనపర్తి** ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఈరోజు జిల్లా కేంద్రంలోని జయశంకర్ సార్ విగ్రహానికి మాజీ మంత్ర సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఒకనాటి విద్యార్థిగా ముల్కీ ఉద్యమములో1969 ఉద్యమములో ఉద్యమపంతులుగా అనంతరం తెలంగాణ ఉద్యమ నిప్పురవ్వని ఆరిపోకుండా మూడు దశాబ్దాలపాటు రాష్ట్ర అభిలాషను సజీవంగా ఉంచిన తెలంగాణ కర్మయోగి, నిస్వార్థ, నిడంబర,విశ్వమానవ తేజోమూర్తి,కె.సి.ఆర్ ప్రారంభించిన మలిదశ తెలంగాణ ఉద్యమానికి దశాబ్దంపైగా సైదాంతిక ఊపిరులూదిన తెలంగాణ జ్ఞాన శిఖరం ఆచార్య జయశంకర్ అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి . కొనియాడారు.ఈ కార్యక్రమములో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,పట్టణ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్,ప్రధాన కార్యదర్శి గంధం.పరంజ్యోతి,మాజీ కౌన్సిలర్స్ నాగన్న యాదవ్,ఉంగ్లం. తిరుమల్, స్టార్.రహీమ్, సూర్యవంశం.గిరి.చిట్యాల.రాము,మండల పార్టీ అధ్యక్షులు బాలరాజు మాజీ భీమన్న,మాజీ ఎం.పి.పిలు,సంధ్య తిరుపతయ్య,సేనాపతి,శివరాం రెడ్డి మతీన్,శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు ఏసీ స్టేడియంలో యోగా దినోత్సవం

**నెల్లూరు** నెల్లూరు నగరంలోని ఏసి స్టేడియంలో 11వ ప్రపంచ యోగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

ఈ యోగాంధ్ర దినోత్సవంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, నెల్లూరు ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొన్నారు. యోగాలో ప్రతిభ చూపిన వారికి మొమెంటోలు అందజేశారు.

# చంద్రబాబు మెప్పుకోసమే బుచ్చయ్య చౌదరి విమర్శలు

**అద్దంకి** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెప్పుకోసమే బుచ్చయ్య చౌదరి జగన్ పై విమర్శలకు పాల్పడుతున్నాడని అద్దంకి వైసీపీ సమన్వయకర్త హనిమిరెడ్డి అద్దంకిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విమర్శించారు. జగన్ కు వస్తున్న ప్రజా ఆదరణ చూసి ఓర్వలేక ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. జనాలను బయటకు రాకుండా చేసేందుకు కూటమి కుట్ర పొందుతుందని పేర్కొన్నారు.

# వ్యాయామం కాదు యోగా ఒక సాధనం

**ఒంగోలు** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని మినీ స్టేడియంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ తమీమ్ అన్సరియా, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొని యోగాసనాలు వేశారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.యోగా ఒక వ్యాయామం కాదని అది మన శరీరాన్ని, మనస్సును ఆరోగ్యంగా ఉంచే ఒక సాధనమని ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలులోని మినీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 6వేల మంది విద్యార్దులు,ప్రజలు పాల్గొని యోగాసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా నేడు యోగా కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయన్నారు. ఎన్నో రికార్డులు సాధించడం జరిగిందన్నారు. దీనిని భవిష్యత్తు తరాలకు అందించే బాధ్యత మనదేదన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ, యోగాను మనందరం సాధన చేయాలన్నారు. ఈ రోజు జిల్లాలో లక్షమంది యోగా సాధన చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది యోగా చేశారని తెలిపారు. జిల్లాలో గత నెలరోజులుగా ఎంతో ఉత్సాహంగా యోగా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు.

# కాకినాడ ఐడిఎ ఆధ్వర్యాన ప్రపంచ సంగీత దినోత్సవం

స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న శ్రీసత్య దంత వైద్యశాల సమావేశ మందిరం లో కాకినాడ ఐడిఎ ఆధ్వర్యాన ప్రపంచ సంగీత దినోత్సవం సంధర్భంగా గంగాధరం ఆర్కెస్ట్రా అధినేత పెదిరెడ్డి సతీష్ ని ఘనంగా సత్కరించారు.ఈ సంధర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ"మన కాకినాడ మరియు చుట్టుపక్కల గ్రామాల లో గంగాధరం ఆర్కెస్ట్రా తెలియని వారు ఉండరని,ఆ గంగాధరం మాస్టారు కుమారుడు పెదిరెడ్డి సతీష్ ని ఈరోజు సత్కరించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.

మన జీవితంలో సంగీతం తో విడదీయరాని బంధం ఉందని,సంగీతానికి దాదాపు ఏదైనా సాధించగల సామర్థ్యం ఉందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న చాలా మంది సంగీత అభిమానులకు ఇది ఒక ముఖ్యమైన రోజు అని అన్నారు.సంగీతం ఒక కళా చికిత్సగా కూడా ఉపయోగించబడుతుందని, ఇది ఆందోళన, నిరాశ, గాయం, సైకోసిస్ మరియు ఒత్తిడి వంటి వాటిని తగ్గించడంలో సహాయపడుతుంది అని , సంగీతం వినడం వల్ల ఆందోళన, రక్తపోటు తగ్గుతాయని, నిద్ర నాణ్యత, మానసిక స్థితి, జ్ఞాపకశక్తి మెరుగుపడతాయని పరిశోధనలలో తేలిందని అన్నారు.ఈ కార్యక్రమం చలనచిత్ర కళాకారుడు బొట్టా అనిల్ మాట్లాడుతూ"మా లాంటి ఎంతో మంది కళాకారులను తీర్చిదిద్దిన గంగాధరం మాస్టారిని మరచిపోలేమని అన్నారు

# వందరోజుల ప్రణాళికలో సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ

## జగిత్యాల మున్సిపల్ ఉద్యోగులు



**జగిత్యాల :** సంపూర్ణ ఆరోగ్య రక్షణలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ను ఘనంగా జరుపుకొంటుండగా జగిత్యాల మున్సిపల్ ఆధ్వర్యంలో సంపూర్ణ ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టారు. జగిత్యాల మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన వందరోజుల ప్రణాళిక లో 20 వ రోజు మెప్మా, సిబ్బంది స్ట్రీట్ వండర్ ఫుడ్స్ ఫెస్టివల్ ను చేపట్టి పాత బస్టాండ్ లో నాణ్యమైన తినుబంధారాలను, ప్రాచీన రుచులను ప్రజలకు పరిచయం చేస్తూ, విక్రయిస్తూ నాసిరకానివి తింటే రోగాలపాలవుతారనే సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. పాత బస్టాండ్ లో మెప్మా ఆధ్వర్యంలో చేపట్టిన ఫుడ్ ఫెస్టివల్ చూపరులను ఆకట్టుకొంది. ఇదిలావుంటే జగిత్యాల పట్టణ ప్రజలందరికి సుపరిచితమైన గంజ్ నాలా శుభ్రం చేయడం చూడని వారేందరో. ఇలాంటి గంజ్ నాలాను వంద రోజుల ప్రణాళిక లో భాగంగా మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది క్లిన్ చేస్తుండడం ఆ ప్రాంత ప్రజలకు ఎంతో సంతోషాన్ని పెంచింది. ఓవైపు యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కోరడం మరోవైపు మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఫుడ్ ఫెస్టివల్, గంజ్ నాలా క్లినింగ్ మరోవైపు సంపూర్ణ ఆరోగ్యాన్ని కోరాడమేనని స్థానికులు అంటున్నారు.

%Edited, Printed, Published and Owned by PURAM MAHESHWAR Printed at HARI HARA ART PRINTERS,H.No.6-185,Toopran,Dist.Medak, Telangana-502336. and Published at H.No. 4-50/18,Kallakal, Vill-Kallakal,(PO). Kadlakal,(M) Manoharabad, Dist.Medak-Telangana -502336. Editor: PURAM MAHESHWAR. RNI. No:TELTEL/2006/17154. Cell:800860999